W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

4-4-2025





## మద్దతు ధరతోనే ధ్యానం కొనుగోలు చేస్తున్నాం..

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- సన్న వడ్లకు ప్రభుత్వం రూ500 బోనస్ చెల్లిస్తుంది
- 25.65 లక్షలమంది రైతన్నలకు 20,687 కోట్ల రూపాయలతో రూ.2 లక్షల వరకు రుణమాఫీ

05



## అమ్మాయి పుట్టడం అద్భుతం

02

### పండుగలా జరుపుకోవాలి!


ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందేశం

మహాలక్ష్మి పుట్టిన ఇంటి వెలుగు ఆ ఇంటికి మాత్రమే కాక, సమాజానికీ వెలుగునిస్తుంది. అమ్మాయిలను గౌరవించడం ద్వారా సమాజం పురోగమిస్తుంది.

# మిర్చికి బంగారు రోజులు

## కోటీశ్వరులైన రైతులు!

రైతుల శ్రమకు న్యాయం జరుగుతు న్నప్పడు, పంట మాత్రమే కాదు ఆత్మస్థైర్యం కూడా వికసిస్తుంది. ముఖ్యంగా ఖమ్మం మార్కెట్‌లో రోజూ 19,000-20,000 క్వింటాళ్ల మిర్చి విక్రయానికి రావడం, గత నెలలో కేవలం 11,000-12,000 క్వింటాళ్ల మిర్చి మాత్రమే రావడంతో ఈ రెండు గణాంకాలు ఇప్పడు మార్కెట్‌లో కొత్త ట్రెండ్‌ను సూచిస్తున్నాయి.



03

## తేజా మిర్చికి రికార్డు స్థాయిలో డిమాండ్

ఇంటర్నేషనల్ మార్కెట్ ప్రభావంతో ధరలు పెరుగుదల

నిల్వవున్న పంటకు మంచి గిరాకీ

రైతన్నకు శ్రమ ఫలిస్తే, ఆ ఆనందానికి హద్దులుండవు. కాలుష్యమయం కాని నిజమైన చిరునవ్వును చూడాలంటే, రైతుల కళ్లలో ఆ వెలుగును చూడాలి. ఎండలో వాడిపోయిన మొహం, మట్టిలో మునిగిపోయిన చేతులు, కష్టాల్లో నిద్రపోని గుండెల్లూవాటన్నింటికీ ఫలితంగా వచ్చిన రుణరహిత జీవితం, గిట్టుబాటు ధరలు, పండిన పంటకు ప్రాపర్ డిమాండ్ ఉంట్యేఅది నిజమైన రైతుల పండగ. ఇప్పడు, ఖమ్మం మిర్చి మార్కెట్ అచ్చంగా ఇదే ఆనందోత్సాహాన్ని ఆస్వాదిస్తోంది!

ఖమ్మం – మహా



## జలపుష్పాల జాతర

ఒక్కసారిగా ఊరంతా చెరువు బాట పట్టింది. చెరువులోని చేపలకోసం వేట ప్రారంభించారు.దీంతో చెరువు జన జాతరగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజక వర్గాలోని కరకగూడెం మండలం కుర్నవల్లి గ్రామం జల పుష్పాల జనజాతరకు వేదిక అయ్యింది.

04

FOLLOW: @ANNTELUGU
4-4-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# అమ్మాయి పుట్టడం అద్భుతం

## పండుగలా జరుపుకోవాలి!

### ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందేశం




కామేపల్లి – మహా: నవజాత శిశువు క్రందనంతో భవిష్యత్ ఆశలు మొలుస్తాయి. ఆ క్రందనం అమ్మాయి శిశువుదైతే అది మరింత పవిత్రం. ఆమె ఇంటికి తళుక్కున వెలుగును తెస్తుంది. కానీ, ఆ వెలుగును మనం ఎలా చూస్తున్నాం? ఇప్పటికీ సమాజంలో ఎక్కడో మూలల్లో అమ్మాయి పుట్టడాన్ని భారంగా భావించే అలవాటు ఉంది. ఇదే దృక్పథాన్ని మార్చాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముందుకు వచ్చారు.

## మా పాప మా ఇంటి మణిదీపం

ఆడపిల్లలు ఇంటికి వెలుగు, కుటుంబానికి ఆశీర్వాదం అనే సందేశాన్ని ప్రసారం చేయడానికి, అమ్మాయి పుట్టిన ప్రతి ఇంటిని సందర్శించి వారికి ప్రత్యేక గౌరవాన్ని అందించాలనే సంకల్పంతో 'మా పాప – మా ఇంటి మణిదీపం' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఓ చక్కటి ఉదాహరణగా, కామేపల్లి మండలం కొత్త లింగాల గ్రామానికి వెళ్లిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అక్కడ ఇటీవల పుట్టిన ఆడపిల్ల ఇంటిని సందర్శించి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్, ఫలాలు అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను, ఇంటి పెద్దలను సన్మానించి, అమ్మాయి పుట్టడం ఎంత గొప్ప విషయం అనేదానిపై అవగాహన కల్పించారు.

> మహాలక్ష్మి పుట్టిన ఇంటి వెలుగు ఆ ఇంటికి మాత్రమే కాక, సమాజానికి వెలుగునిస్తుంది. అమ్మాయిలను గౌరవించడం ద్వారా సమాజం పురోగమిస్తుంది.

## జిల్లా అంతటా పండుగ వాతావరణం

ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక గ్రామానికి మాత్రమే పరిమితం చేయకుండా, ఖమ్మం జిల్లాలోని మరో 20 చోట్ల నిర్వహించారు. జిల్లాలో పుట్టిన అమ్మాయిలకు వారి ఇంటికెళ్లి శుభాకాంక్షలు తెలుపుతూ, తల్లిదండ్రులను గౌరవిస్తూ జిల్లా అధికారులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. అమ్మాయి పుట్టిందంటే ఆ ఇంటికి మహాలక్ష్మి అడుగుపెట్టినట్లే. ఈ భావనతోనే, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ వివరించారు. ఈ వినూత్న కార్యక్రమానికి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు మద్దతు పలికాయి. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ పి. సునీత, మైనార్టీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, మత్స్యశాఖ సంచాలకులు జి. శివప్రసాద్, పంచాయతీ అధికారి ఆశాలత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అమ్మాయి పుట్టిందంటే అదృష్టం

కుటుంబంలో అమ్మాయి పుట్టడం అపురూపం. అదృష్టం ఉన్నవాళ్లకే ఆ వరం లభిస్తుంది. కాబట్టి, ఆడపిల్లల్ని ప్రేమతో, గౌరవంతో, భయపడకుండా పెంచాలి. వారికి సమాన అవకాశాలు, విద్య, ఆస్తి, స్వేచ్ఛ కల్పించాలి" అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టం చేశారు. అమ్మాయిలు తగినంత చదువు పూర్తిచేసిన తర్వాత, స్వయం సంపన్నులు అయిన తర్వాతే పెళ్లి గురించి ఆలోచించాలన్న సూచన చేశారు. బాల్యవివాహాలు, అమ్మాయిల్ని ఆర్థికంగా పరాధీనంగా ఉంచడం వంటి వాటిని ఖండించారు.









# మిర్చికి బంగారు రోజులు!

## ఇంటర్నేషనల్ మార్కెట్ ప్రభావంతో ధరలు పెరుగుదల

**తేజా మిర్చికి రికార్డు స్థాయిలో డిమాండ్ | నిల్వ వున్న పంటకు మంచి గిరాకీ**



రైతన్నకు శ్రమ ఫలిస్తే, ఆ ఆనందానికి హద్దులుండవు. కాలుష్యమయం కాని నిజమైన చిరునవ్వును చూడాలంటే, రైతుల కళ్లలో ఆ వెలుగును చూడాలి. ఎండలో వాడిపోయిన మొహం, మట్టిలో మునిగిపోయిన చేతులు, కష్టాల్లో నిద్రపోని గుండెలు వాటన్నింటికీ ఫలితంగా వచ్చిన రుణరహిత జీవితం, గిట్టుబాటు ధరలు, పండిన పంటకు ప్రాపర్ డిమాండ్ ఉంటేఅది నిజమైన రైతుల పండగ. ఇప్పుడు, ఖమ్మం మిర్చి మార్కెట్ అచ్చంగా ఇదే ఆనందోత్సాహాన్ని ఆస్వాదిస్తోంది! గత కొంతకాలంగా స్థిరంగా ఉన్న మిర్చి ధరలు ఒక్కసారిగా పైకి దూసుకెళ్తూ, రైతుల జీవితాల్లో కొత్త వెలుగును నింపాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో జరుగుతున్న వాణిజ్య మార్పులు, దేశీయంగా పెరిగిన మిర్చి డిమాండ్, నాణ్యమైన తేజా మిర్చికి విపరీతమైన గిరాకీఈ మూడు అంశాలు కలసి, రైతుల ఆనందాన్ని రెట్టింపు చేస్తున్నాయి. తాజాగా, మిర్చి ధరలు క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.500 వరకూ పెరగడం గమనార్హం. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం, ఈ పెరుగుదల మున్ముందు మరింత వేగంగా జరగబోతోంది.

**ఖమ్మం మిర్చి యార్డులో కోటీశ్వరు లైన రైతులు!**

రైతుల శ్రమకు న్యాయం జరుగుతున్నప్పుడు, పంట మాత్రమే కాదుఆత్మస్థైర్యం కూడా వికసిస్తుంది. ముఖ్యంగా ఖమ్మం మార్కెట్‌లో రోజూ 19,000–20,000 క్వింటాళ్ల మిర్చి విక్రయానికి రావడం, గత నెలలో కేవలం 11,000–12,000 క్వింటాళ్ల మిర్చి మాత్రమే రావడయిఈ రెండు గణాంకాలు ఇప్పుడు మార్కెట్‌లో కొత్త ట్రెండ్‌ను సూచిస్తున్నాయి. ఇటీవల గడచిన రోజుల్లో తేజా మిర్చి ధరలు రూ.11,000 నుంచి రూ.12,000 మధ్య ఉండగా, ఇప్పుడు అదే మిర్చి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.13,300–13,500 పలుకుతోంది. మోడల్ ధరలు కూడా రూ.11,500–12,000 మధ్య ఉండటంతో, రైతుల ఉత్సాహానికి బ్రేకులు పడటం లేదు. ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు చెబుతుండటంతో, రైతుల సంతోషానికి హద్దులు లేవు.

### రైతుల భవిష్యత్తు మరింత వెలుగు!

రైతులు తమ ఉత్పత్తికి గిరాకీ పెరుగుతుంటే, ఆ వృద్ధి దేశ ఆర్థికవ్యవస్థకే బలాన్ని ఇస్తుంది. ప్రస్తుతం మార్కెట్ వర్గాలు భావిస్తున్న అంచనాల ప్రకారం

మిర్చి ధరలు ఇంకొన్ని వారాలు పెరిగే అవకాశం

ప్రభుత్వం రైతుల మద్దతు ధరను సమీక్షిస్తే మరింత లాభం

ఎగుమతులు పెరిగితే, దేశీయంగా ధరల పెరుగుదలకు మరింత బలం

### మిర్చి ధరల పెరుగుదల వెనుక ఉన్న రహస్యాలు!

**అంతర్జాతీయ మార్కెట్లో మిర్చి డిమాండ్ పెరగడం**

ప్రపంచవ్యాప్తంగా మిర్చికి డిమాండ్ పెరిగింది. భారతదేశం నుంచి మిర్చి ఎగుమతులు భారీగా పెరగడం వల్ల, దేశీయ మార్కెట్లో మిర్చికి మంచి ధరలు దక్కుతున్నాయి.

**నాణ్యమైన తేజా మిర్చికి విపరీతమైన గిరాకీ**

తేజా మిర్చికి మార్కెట్‌లో ప్రత్యేక స్థానం ఉంది. అందులోని రంగు, సువాసన, గట్టి మెతుకు గుణాలు ఈ రకాన్ని వాణిజ్యపరంగా అత్యంత విలువైనదిగా నిలిపాయి.

**దేశీయంగా మిర్చి కొనుగోళ్లు ఊపందుకోవడం**

దేశీయంగా కూడా మిర్చికి మంచి గిరాకీ ఉంది. మిర్చిని ఉపయోగించే ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు, ఎగుమతి సంస్థలు ఇప్పుడు భారీగా మిర్చిని కొంటున్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా సరఫరా తగ్గడం - తక్కువ అందుబాటులో ఎక్కువ ధర**

ఈ సీజన్‌లో రైతులు తమ మిర్చిని నిల్వ చేసుకోవడం, మార్కెట్లో తక్కువ పరిమాణంలో మిర్చి అందుబాటులో ఉండటంతో, తక్కువ సప్లైకి ఎక్కువ డిమాండ్ ఏర్పడింది.

### రైతు ఆశలు - కోటి వెలుగులు!

రైతులు ఇప్పుడే అమ్మకానికి తలపెట్టకుండా, మరికొన్ని రోజులు వేచి చూస్తే, మరింత లాభదాయకమైన ధరలు పొందవచ్చని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ మద్దతుతో, సబ్సిడీలతో రైతులకు మరింత ఆదరణ లభిస్తే, మిర్చి రైతుల జీవితాల్లో గంగపుటేరులు పారడం ఖాయం.



## జలపుష్పాల...జాతర

**మణుగూరు, మహా:** ఒక్కసారిగా ఊరంతా చెరువు బాట పట్టింది.చెరువులోని చేపలకోసం వేట ప్రారంభించారు.దీంతో చెరువు జన జాతరగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని కరకగూడెం మండలం కుర్నవల్లి గ్రామం జల పుష్పాల జనజాతరకు వేదిక అయ్యింది.పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన కరకగూడెం మండలంలోని చెరువులు వేసవికాలం కావడంతో పూర్తిగా ఇంకిపోయాయి.దీంతో చేపలు పట్టుకునేందుకు వీలుగా వున్నప్పుడు ఆయా గ్రామాల ప్రజలకు సమాచారాన్ని ఇవ్వడం ఆనవాయితీ. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వలలు,ఊతాలు పట్టుకుని పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. దీంతో జల పుష్పాలకోసం వచ్చిన జనంతో జాతరగా మారింది.ఇంకేముంది ఊరంతా చేపలకూరే మరి.





# మా భూములను కాపాడండి సార్..

## మంత్రి పొంగులేటికి వినతి చేసిన జీళ్లచెరువు రైతులు

### 70ఏళ్ళ నుంచి సాగు చేసుకుంటున్న దళితుల భూములను సర్వే చేస్తున్న అధికారులు

- తమ బతుకుదెరువు లాక్కుంటే మరణమే అన్న రైతులు
- రైతుల పక్షాన మంత్రితో మాట్లాడిన పెండ్ర అంజయ్య..
- సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి..
- రైతులకు అన్యాయం చేయొద్దంటూ ఆర్డీవో, తహసీల్దార్‌కు ఆదేశించిన మంత్రి పొంగులేటి

**కూసుమంచి, ఏప్రిల్ 3, మహా:** గత డెబ్బై సంవత్సరాలుగా తమ తాతల తండ్రుల కాలం నుంచి సాగుచేసుకుని జీవనం వెల్ల దీసుకుంటున్న జీళ్ళచెరువు గ్రామానికి చెందిన నిరుపేద దళిత, బీసీ రైతులు రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి చేశారు. తమ భూములలో రెవెన్యూ అధికారులు అకస్మాత్తుగా సర్వే చేయడం తట్టుకోలేని రైతులు గురువారం మంత్రి కూసుమంచి మండల పర్యటనలో భాగంగా ధర్మతండాకు రావడంతో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్ర అంజయ్య ఆధ్వర్యంలో సుమారు 40మంది రైతులు మంత్రిని కలిసి గోడు వెళ్ళబోసుకున్నారు. జీళ్లచెరువులోని సర్వే నంబర్ 430లో సుమారు 40మంది రైతులు భూమి సాగు చేసుకుంటుంటే, గురువారం అకస్మాత్తుగా రెవెన్యూ అధికారులు భూమి సర్వే చేయడంతో ఏంటని వారు మంత్రికి వివరించారు. ఈ భూమిని గడిచిన 70ఏళ్ళ నుంచి సాగు చేసుకుంటున్నామని, దరణి వల్ల కొంతమందికి పాస్ పుస్తకాలు వచ్చాయి, కొంతమందికి రాలేదని మంత్రికి వివరించారు. మహిళా రైతులు మంత్రి ఎదుట కన్నీరు మున్నీరైయ్యారు. దీంతో స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వారి సమస్య పట్ల సానుకూలంగా స్పందించారు. తక్షణమే ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ కరుణశ్రీ ని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూసుమంచి మండలానికి వందపడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైందని, దానిని నిర్మించేందుకు ప్రభుత్వ స్థలం అప్పగించాలని సర్వే చేస్తున్నామని వారు చెప్పడంతో రైతులంతా విస్మయానికి గురైయ్యారు. దీంతో పెండ్ర అంజయ్య మాట్లాడుతూ ఈ సర్వే నంబర్లో కుటుంబానికి ఒక ఎకరం, అర్థ ఎకరం భూమి జీవనాధారంగా మలుచుకుని వారంతా జీవితం ఎల్లదీస్తుంటే ప్రభుత్వ అధికారులు సర్వే చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. ఆ భూముల విషయంలో సర్వే ఆపకపోతే ఆత్మహత్యే చరణ్యమని రైతులు మంత్రికి వివరించారు. ఇదే గనుక జరిగితే మరణమే శరణ్యమని మంత్రి పొంగులేటికి సమస్య విన్నవించారు. వినతి పరిశీలించిన మంత్రి వెంటనే ఆర్డీవో, తహసీల్దార్ కరుణ శ్రీని సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూసి రైతులకు అన్యాయం జరగవద్దని సూచించారు. రైతులంతా దళితులని వారికి గతంలో ప్రభుత్వాలు అందజేసిన భూమి ఇప్పుడు తీసుకుంటే ఎలా అని మంత్రి అధికారులను హెచ్చరించారు సమస్య లేకుండా పరిష్కరించాలని, అవసరం అయితే వేరే అవకాశం ఉంటే చూడాలని వారిని ఆదేశించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్ర అంజయ్య, కొండా శ్రీనివాస్ రావు, కాసాని వెంకన్న, బాలబోయిన శ్రీను, రైతులు మడిపల్లి ప్రసాద్, చింతలపాటి రామకృష్ణ, గోపి హరినాథ్, గోపి మల్లేష్, బాలబోయిన ఉపేందర్, గుమ్మడెల్లి వెంకన్న, నాగలక్ష్మి, దళిత రైతులు సుమారు 50మంది పాల్గొన్నారు.

## వార్డ్ ఆఫీసర్లకు రెవెన్యూ విభాగంపై సమగ్ర శిక్షణ



**ఖమ్మం – మహా:** నగర పాలక సంస్థ పరిధిలో కొత్తగా నియమితులైన వార్డ్ ఆఫీసర్లకు రెవెన్యూ విభాగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు విధానం, ట్రైడ్లైసెన్స్ మంజూరు వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, రెవెన్యూ సేవలను సమర్థంగా నిర్వహించే విధానాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వార్డ్ ఆఫీసర్లతో సమగ్ర చర్చలు నిర్వహించారు. రెవెన్యూ విభాగం ప్రధాన విధులు, ఆదాయ వనరులు, ఆదాయ పెంపుపై తీసుకోవాల్సిన చర్యలు, పన్నుల వసూలు విధానాలను వీరికి వివరించారు. నగర అభివృద్ధికి రెవెన్యూ విభాగం కీలకంగా ఉంటుందని, ఇందుకు అధికారి, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం అవసరమని స్పష్టం చేశారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**చర్ల, మహా;** రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డ పెళ్లి చేసి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా మంజూరైన చెక్కులను తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పంపిణీ చేశారు. ఒక్క కుటుంబానికి రూ, 1,00,116 చొప్పున మొత్తం 39 కుటుంబాలకు కల్యాణ లక్ష్మి చెక్కలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు వెళుతున్న భక్తులకు రోడ్డు ప్రమాదం



**అశ్వారావుపేట, ఏప్రిల్ 3, మహా:** భద్రాచలం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అసుపాక సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో పలువురు భక్తులకు గాయాలయ్యాయి.

## తాలిపేరు ప్రాజెక్టు మరమ్మతులను పూర్తి చేయండి

**చర్ల, మహా ;** మండలం లోని తాలిపేరు ప్రాజెక్టును కార్యనిర్వాహక ఇంజినీర్ సయ్యద్ అహ్మద్ జానీ గురువారం తనిఖీ చేసారు. అలాగే ప్రాజెక్ట్ వద్ద పెండింగులో ఉన్న పనులను గురించి తాలిపేరు ప్రాజెక్ట్, డి. ఇ. ఇ. తిరుపతి ని అడిగి తెలుసుకున్నారు. అలాగే పనులన్నింటినీ వర్షాకాలం లోపే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎడమ కాలువకు రెండవ పంటకు నీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. రెండో పంట నీళ్లను కూడా ఈ నెల 10వ తేది వరకు వదిలి, సత్వరమే తాలిపేరు ప్రధాన కాలువలపై అండర్ టన్నెల్ ల నిర్మాణ మరియు ఇతర మరమ్మత్తు పనులను కూడా ప్రారంభించాలని ఆదేశించారు.



Follow: @ANNTELUGU
4-04-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# చివరి గింజ వరకు ధాన్యం కొంటాం

## మద్దతు ధరతోనే ధ్యానం కొనుగోలు చేస్తున్నాం..

### రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**కూసుమంచి, ఏప్రిల్ 3 మహా :** రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మంత్రి, కూసుమంచి మండలంలో పర్యటించారు. ముందుగా మంత్రివర్యులు కూసుమంచి మండలం నాయకన్ గూడెంలోని గంగమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని నాయకన్ గూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించామని, రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గడిచిన సంవత్సర కాలంలో 25 లక్షల 65 వేల రైతన్నలకు 20 వేల 687 కోట్ల రూపాయలతో 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసామన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన రైతు బంధు నిధులను ప్రజా ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. దేశ చరిత్రలో మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, గత వానాకాలం పంటకు దాదాపు 1700 కోట్ల రూపాయలు బోనస్ అందించామని అన్నారు. యాసంగిలో కూడా సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లించి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు. గత ప్రభుత్వాలు వరి పంటపై నియంత్రణ పెట్టాయని, ప్రజా ప్రభుత్వంలో మన రైతులు పండించిన ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతు భరోసా పెండింగ్ నిధులను త్వరలో రైతుల ఖాతాలలో జమ చేస్తామని అన్నారు. రాష్ట్రంలో నీటి సమస్య రాకుండా రైతుల పొలాలకు సాగునీరు సరఫరా చేస్తున్నామని అన్నారు. గత వానాకాలం పంట సమయంలో రికార్డు స్థాయిలో వరి పంట పండిందని అన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వానాకాలం, యాసంగి ధాన్యం మన రాష్ట్రంలో పండుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతన్నల దగ్గర నుంచి పంట కొనుగోలు



చేస్తామని రైతులు ఎవరు అనవసర ఆందోళనకు గురి కావద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, అడిషనల్ డిఆర్డీవో నూరొద్దీన్, తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### 500 రూపాయల బోనస్

కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వానాకాలం సీజన్ లో నాయకన్ గూడెంలోని 250 రైతుల నుంచి 12 వేలకు పైగా క్వింటాళ్ల ధాన్యాన్ని మద్దతు ధరపై కోనుగోలు చేయడం జరిగిందని అన్నారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. మన జిల్లాలో పండించిన సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లించి కొనుగోలు చేసిన తర్వాత వాటిని రైస్ మిల్లుల ద్వారా బియ్యం చేసి ప్రజలకు ఉచితంగా రేషన్ సరఫరా చేస్తున్నామని, సంవత్సరానికి సరిపడా సన్న రకం బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### రైతన్న కృషి మరువలేనిది

మన జిల్లా రైతన్నల కృషి ఫలితంగా ఇతర జిల్లాలకు కూడా సన్న రకం బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. యాసంగి పంట ఎండిపోకుండా మంత్రి ప్రత్యేకంగా పర్యవేక్షించారని, చివరి భూములకు నీరు అందేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. గత యాసంగి కంటే అధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రెండు లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉందని అన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేస్తామని రైతులు అనవసర వదంతులు నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించాలని అన్నారు.

# పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దు...!



**నేలకొండపల్లి, ఏప్రిల్ 3 మహా:** పారిశుద్ధ్యం పనుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) పి.శ్రీజ హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం పర్యటించారు. తొలుత ఏళ్ల తరబడి నత్తనడక సాగుతున్న నూతన గ్రంధాలయం పనులను పరిశీలించారు. సంబంధిత అధికారుల ను పని ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు శర వేగంగా పూర్తి చేయాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కలియతిరిగారు. రాజీవ్ యువశక్తి పథకం కు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ -ను పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను గురించి తెలుసుకున్నారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయం లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఏకరూప వస్త్రం ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి. హెచ్.శివ, ఐకేపీ ఏపీయం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు .

# జిల్లా పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాలను తిరిగి పొందడానికి ఆరు నెలల గడువు




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 03,మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులతో సంభంధం ఉన్న 116 ద్విచక్ర వాహనాలు మరియు 10 ఇతర వాహనాలు హేమచంద్రపురం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్లో ఉంచడం జరిగిందని, జిల్లా పోలీస్ మోటార్ వాహనాల అధికారి ఓ.సుధాకరరావు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించి సరైన పత్రాలను చూపించి తమ వాహనాలను ఈ రోజు నుండి 6 నెలల లోపు పొందవచ్చునని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ముందుగా ఈ వాహనాలకు సంబంధించి సరైన పత్రాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో సమర్పించి అక్కడి నుండి రుజువు పత్రాన్ని పోంది మోటారు వాహనాల అధికారి కార్యాలయంలో సమర్పించి తిరిగి వారి వాహనాన్ని పొందవచ్చని తెలిపారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచనల ప్రకారం ఈ అన్ క్లెయిమ్డ్ వాహనాల జాబితాను జిల్లా పోలీస్ సోషల్ మీడియా ఖాతాల్లో ఉంచడమైనదని తెలిపారు. ఈ వాహనాల యజమానులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని మోటార్ వాహనాల అధికారి కోరారు.

# 37వ డివిజన్‌లో సన్న బియ్యం పంపిణీ



**ఖమ్మం అర్బన్ – మహా:** ఖమ్మం 37వ డివిజన్ లోని 31వ జాతీయ రేషన్ షాపులో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మారుతి వీరభద్ర ప్రసాద్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత రేషన్ అందిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని, ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మందా సరస్వతి, డీకొండ శ్యాంసుందర్, పిల్లలమర్రి వెంకట్ నారాయణ, పోలా హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. రేషన్ దుకాణంలో మోడీ చిత్రపటాన్ని ప్రదర్శించాలని, లేదంటే కలెక్టర్‌కు విన్నవిస్తామని తెలిపారు.

# నేడు భద్రాద్రి రానున్న మంత్రి తుమ్మల

**మహా భద్రాచలం:** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు శుక్రవారం భద్రాచలం రానున్నారు.ఉదయం 10 గంటలకు కూనవారం రోడ్ లో నూతనంగా నిర్మిస్తున్న కరకట్టను మంత్రి పరిశీలిస్తారు. అనంతరం 10.30 గంటలకు స్వామి వారి దర్శనం అనంతరం కళ్యాణ పనులు పరిశీలించి, స్థానిక ఆర్ డి ఓ కార్యాలయంలో శ్రీరామ నవమి రివ్యూ మీటింగులో పాల్గొననున్నారు.

# గిరిజన సంస్కృతి ప్రపంచానికి తెలిసేలా

**మహా భద్రాచలం:** ఐ టీ డి ఏ పి ఓ రాహుల్ నూతన వరవడికి శ్రీకారం చుట్టారు. గతంలో నామమాత్రంగా ఉన్న ట్రైబల్ మ్యూజియం ప్రస్తుతం అన్ని హంగులతో సిద్ధమైంది. చూపర్లను ఆకట్టుకునే విధంగా మారింది. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచారాలు, జీవన విధానం కళ్ళకు కట్టినట్లు ఉట్టిపడేలా ఈ ట్రైబల్ మ్యూజియం రూపుదిద్దుకుంది.శ్రీరామ నవమి నాడు ముఖ్యమంత్రి చేతులు మీదుగా ప్రారంభం కానుంది. భద్రాచలం ఐటిడిఏ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ట్రైబల్ మ్యూజియం సజీవ సంస్కృతికి నిలయంగా మారింది. గిరిజనుల ఆనాటి ఆచార సాంప్రదాయాలు, జీవన విధానం, పండుగలు, ఉపయోగించిన పనిముట్లు అన్ని సేకరించి ట్రైబల్ మ్యూజియంలో భద్రపరిచారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను కళ్ళకు కట్టినట్లు ఈ మ్యూజియంలో ఉన్న వస్తువులు చూపిస్తున్నాయి. ఇవి చూపర్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. గిరిజనుల ఇల్లు, వాకిళ్లు, ఎడ్లబండ్లు, వేటకు ఉపయోగించిన వస్తువులు... ఇలా రకరకాలు ఆనాడు గిరిజనులు ఉపయోగించిన వస్తుశాలను ప్రదర్శనగా ఉంచటంతో ఇవి వీక్షకులను ఆలోచింప చేస్తున్నవి. గిరిజనుల వేషధారణ, అలవాట్లు, కట్టుబాట్లు తరతరాల చిత్రకళ కూడా శోభయామానంగా ఉన్నాయి. ఈ ట్రైబల్ మ్యూజియమును ఐటిడిఏ పిఓ రాహుల్ ఆధునికరించి ప్రస్తుతం అన్ని హంగులతో తీర్చిదిద్దారు.



Follow: @ANNTELUGU
4-04-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## వ్యవసాయ భూమి లో ఫామ్ పౌండ్ నిర్మాణం

# రైతుల అభివృద్ధికి నాంది

### అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

### మండల కార్యాలయాల్లో రాజీవ్ వికాసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 03,మహా:** వ్యవసాయ భూములలో ఫామ్ పాండ్ నిర్మాణం రైతుల ఆర్థిక అభివృద్ధికి నాంది అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలో పురోగతిలో ఉన్న ఉపాధి హామీ పనులు, జల్ సంచెయ్ జెన్ భాగీదారి, నర్సరీలలో మొక్కల పెంపకం, త్రాగునీటి పైపుల మరమ్మత్తు పనులు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, అంగన్వాడీలలో విద్యుదీకరణ తదితర అంశాలపై గురువారం ఐ డి ఓ సి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ లక్ష్యాలను సాధించినందుకు అధికారులను అభినందించారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఉపాధి హామీ పథకం లక్ష్యాలను త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో అన్ని వ్యవసాయ భూముల్లో ఫాం పాండ్ నిర్మాణాలను చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 52 వేల బోర్లు వ్యవసాయ భూముల్లో ఉన్నాయని, కనీసం 50 వేల ఫామ్ పాండ్ నిర్మాణాలను చేపట్టాలన్నారు. బోర్ ఉన్న ప్రతి వ్యవసాయ భూమిలో కచ్చితంగా ఫాం పాండ్ ఉండాలన్నారు. ఫాం పాండు నిర్మాణం ద్వారా చేపల పెంపకం, అజోల్ల పెంపకం వంటి వాటిని సాగు చేయడం ద్వారా రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అన్నారు. మన జిల్లాలో చేపడుతున్న ఫాం పాండ్ త్రవ్వకాలు, మునగ సాగు వంటి వాటిని ఆదర్శంగా ఇతర జిల్లాలు తీసుకుని ముందుకు సాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం కూలీల అందరికీ జీవనజ్యోతి మరియు జీవన సురక్ష పథకం గురించి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ప్రతి ఒక్కరికి ఆ పథకాల యొక్క ప్రయోజనాలు వివరించాలని అధికారులను ఆదేశించారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందువలన ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా అనే పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులు వద్ద త్రాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. జల్ సంచెయ్ , జెన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలు మరియు ప్రభుత్వ స్థలాలో ఎన్ని ఇంకుడు గుంతలు త్రవ్వడానికి అవకాశం ఉందో సోమవారం లోగా నివేదికలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు మరియు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో కలిసి ఉద్దేశించిన పరిమాణంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు సమన్వయంతో చేపట్టాలన్నారు. జిల్లాలో త్రవ్విన ఇంకుడు గుంతల చుట్టూ గోరింటాకు మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకుడు గుంతలు మరియు ఫామ్ పౌండ్ వివరాలను గ్రామ మండల మరియు జిల్లా స్థాయిలో నివేదికల సమర్పించాలని ఆదేశించారు. ఇంకుడు గుంతలు నిర్మాణాల్లో జిల్లాలోని యువతను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. ఏ గ్రామంలో అయితే ఎక్కువ ఇంకుడు గుంతలు నిర్మాణం చేపడతారు వారిని ఆగస్టు 15 న 5 గురికి సన్మాన కార్యక్రమం చేయడం జరుగుతుంది అని తెలిపారు. నిర్మాణం చేపట్టిన ప్రతి ఇంకుడు గుంత వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి అవార్డు రావాలని అందులో మన జిల్లా అగ్రస్థానంలో నిలవడమే ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. మే 31 వ తేదీ నాటికి అన్ని వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని ఆయన తెలిపారు.

## స్కాన్ చేస్తే...
## చేతిలో సమాచారం




**మహా భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 6,7 వ తేదీలలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణం, మహా పట్టాభిషేకం కార్యక్రమాలను తిలకించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాలు నుండి లక్షలాది మంది భక్తులు భద్రాచలం వస్తారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ శాఖ, సమాచార శాఖ ఆధ్వర్యంలో ఒక క్యూ ఆర్ కోడ్ రిలీజ్ చేశారు. క్యూ అర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు భద్రాచలంలో భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు అన్ని తెలుస్థాయు. భక్తులకోసం ఏర్పాటు చేసిన వసతి, ప్రసాదాల కౌంటర్లు, తలంబ్రాల కౌంటర్లు, ఉచిత వైద్య శిభిరం, వాష్ రూమ్స్, దర్శనం, ఇలా అన్ని విషయాలు ఆ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలుస్థాయు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఈ క్యూ ఆర్ కోడ్ వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## గుడుంబా స్థావరాలపై మెరుపు దాడులు



**మహా భద్రాచలం:** తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలలో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా నాటు సార్ ఆ స్థావరాలపై మెరుపు దాడి నిర్వహించారు. బోర్డర్ ప్రాంతాలైన గుండు వారి గూడెం, పిచ్చుకలపాడు గ్రామాలలో నాటు సారా తయారుచేసి, విక్రయిస్తున్న పలు కేంద్రాలపై దాడులు నిర్వహించి గుడుంబా తయారకి సిద్ధంగా ఉంచిన 6800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అలాగే 60 లీటర్ల నాటుసారాని స్వాదీనం చేసుకుని పలువురిని అరెస్ట్ చేశారు. ఈ దాడులలో ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించిన ఎక్సైజ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సందర్శించిన అదనపు కలెక్టర్ శ్రీజ

**ముదిగొండ ఏప్రిల్ 3 మహా:** మండల కేంద్రమైన ముదిగొండ,గోకినేపల్లి గ్రామాలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి శ్రీజ గురువారం పర్యటించారు.ఈసందర్భంగా గ్రంథాలయాలను ఆమె సందర్శించి పరిశీలించారు.శిథిలావస్థలో ఉన్న ముదిగొండ గ్రంథాలయాన్ని నూతన నిర్మాణం జరిగే వరకు వేరే చోట కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ ఎస్ శ్రీధర్ స్వామిను ఆమె ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ వాల్మీకి కిషోర్,జిల్లా లైబ్రరియన్ అఖిల్,పంచాయతీ కార్యదర్శులు సిహెచ్ రామకృష్ణ,మేకల పావని తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రికార్డులను పరిశీలించిన డిపిఓ




**ముదిగొండ ఏప్రిల్ 3 మహా :** మండల కేంద్రమైన ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి(డిపిఓ) ఆశాలత గురువారం అకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పంచాయతీలోని పలు రికార్డులను ఆమె పరిశీలించారు.పంచాయతి సెక్రటరీ రామకృష్ణతో ఆమె మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో డిఎల్పిఓ రాంబాబు,ఎంపీఓ వాల్మీకి కిషోర్,పంచాయతీ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

## ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**సత్తుపల్లి, ఏప్రిల్ 3:మహా:** సమాజంలో ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్తుపల్లి ప్రత్యేక పాలన అధికారి టి సునీల్ రెడ్డి అన్నారు, బేటి బచావో బేటి పడావో మా పాప మా ఇంటి మణిద్వీపం కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి జహార్ నగర్ అంగన్వాడి సెంటర్లో ఏర్పాటు చేసిన ఆడపిల్ల జన్మోత్సవ వేడుకల లో భాగంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో తల్లిదండ్రులు మగ సంతానం కు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తున్నారని సృష్టిలో ఆడ మగ సమానమని పిల్లలు లేకపోతే సృష్టి మనుబడే ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు, ఆడపిల్లల తల్లిదండ్రులు పిల్లలను చక్కగా చదివిస్తే ఉద్యోగాలలో స్థిరపడతారని అందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన తెలిపారు.



## గోపాలరావుపేటలో మా ఊరు మణిదీపం




**కూసుమంచి, ఏప్రిల్ 3, మహా:** మండలంలోని జీళ్ళ చెరువు పంచాయతీ పరిధిలో గోపాల్ రావుపేట గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మా ఊరు మన దీపం కార్యక్రమం నిర్వహించడం జరిగింది బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మన ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారంగా మా ఇంటి మణిదీపం అనే కార్యక్రమం నందు గోపాలరావుపేట గ్రామంలో గుడిపల్లి సంధ్య తండ్రి మేర నాగయ్య ఇంటి వద్ద ప్రోగ్రాం నిర్వహించారు. గుడిపల్లి సంధ్య మాధవరావు కి సన్మానం చేయడం జరిగింది. కార్యక్రమంలో కూసుమంచి మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీలత. ఎమ్మార్వో కరుణ శ్రీ ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి , సిడిపిఓ కవిత , ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రమాదేవి సువర్చల, ఏఎన్ఎం ఆశ అంగన్వాడి టీచర్లు, పాల్గొన్నారు.

Follow: @ANNTELUGU
4-04-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# పచ్చని భూములను కొల్లగొట్టొద్దు

- భగ్గుమన్న భారతీయ జనతా పార్టీ
- ఖమ్మంలో బీజేవైఎం నిరసన సెగ
- ప్రకృతి సంరక్షణ కోసం పోరాటం ఉధృతం
- భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం , ఏప్రిల్ 03, మహా:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంపై ఆందోళన మిన్నంటుతోంది. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు, పర్యావరణవేత్తలు, ప్రజాసంఘాలు నిరసన రథాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. విద్యార్థుల నిరసనలపై పోలీసుల నిర్బంధ చర్యలతో దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులపై లాఠీచార్జ్, అరెస్టులపై ఆగ్రహంతో, ప్రజల గొంతుకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ), బీజేవైఎం సమరశంఖం పూరించింది. ఖమ్మం జిల్లాలో బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. నల్లబ్యాడ్జీలతో వీధుల్లోకి దిగి ప్రభుత్వ మొండివైఖరిని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వానికి హెచ్చరికగా బీజేపీ నిరసనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రకటించారు.

## ప్రభుత్వ భూముల వేలంపై అగ్గిమీద గుండ్రాలు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం వేలానికి పెడతామని ప్రకటించడంతో తీవ్ర కలకలం రేగింది. విద్యార్థులు, అధ్యాపకులు, పర్యావరణవేత్తలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పచ్చని చెట్లు నరుకుతుంటే, ప్రకృతి నాశనమైపోతుంటే, ప్రభుత్వం లాభాల కోసం భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించడాన్ని సమర్థించలేమని ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు.

## భాజపా రోడ్డెక్కిన నిరసనలు

ఈ వ్యవహారంపై విద్యార్థుల నిరసనలను అణచివేయడానికి పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో, ఈ విషయాన్ని తప్పుబడుతూ బీజేపీ నిరసన బాట పట్టింది. ఖమ్మం నగరంతో పాటు పలు మండలాల్లో భారీ స్థాయిలో నిరసనలు జరిగాయి. భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు నల్లబ్యాడ్జీలతో రోడ్డెక్కి, ప్రభుత్వం తక్షణమే ఈ వేలాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద బీజేపీ కార్యకర్తలు బైఠాయించి ఆందోళన చేపట్టారు. భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు.

## ప్రకృతి రక్షణకు ప్రజల సంఘీభావం

సెంట్రల్ యూనివర్సిటీ పరిసర ప్రాంతం నెమళ్ళు, జింకలు, అరుదైన తాబేళ్ల వంటి వన్యప్రాణులకు ఆశ్రయం ఇస్తోంది. ఈ భూమిని అభివృద్ధి చేయాలంటే, అటవీ సంరక్షణ చట్టం-1980 ప్రకారం కేంద్ర అనుమతి అవసరం. కానీ ప్రభుత్వం ఎలాంటి అనుమతి లేకుండానే ఈ ప్రదేశాన్ని వేలం వేయాలని చూస్తోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు చెట్లను నరికి, భూమిని మునుపటి రూపాన్ని కోల్పోయేలా చేస్తున్న దృశ్యాలను చూపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంత ఉపేందర్ గౌడ్ , జిల్లా ఉపాధ్యక్షుడు దుద్దుకూరు కార్తీక్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఈదుల భద్రం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోంగూర వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు శీలం పాపారావు, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, జిల్లా నాయకులు సుదర్శన్ మిశ్రా,నల్లగట్ల ప్రవీణ్ కుమార్,రేఖ వెంకట సత్యనారాయణ, నల్లగట్టు ఉపేందర్ ఏలూరి నాగేశ్వరరావు, తొడుపునూరి రవీందర్, భూక్య నాయక్, కుమిలి శ్రీనివాస్, జ్యోతుల యుగంధర్, నెల్లూరి బెనర్జీ, ఆచంటి కోటేశ్వరరావు, గడీల నరేష్ పిల్లలమర్రి వెంకట్, డికొండ శ్యామ్, రీగన్ ప్రతాప్, వలల రమేష్ , కందుల కృష్ణ , రుద్ర ప్రదీప్ రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.










### వేలం నడవదు!' భాజపా హెచ్చరిక

భాజపా జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, 'సెంట్రల్ యూనివర్సిటీ భూమిని రియల్ ఎస్టేట్ మాఫియాకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఇది చెల్లదని, భూములను పరిరక్షించేందుకు తాము పోరాటం కొనసాగిస్తామని' హెచ్చరించారు. భూములను కాపాడాలని 22,000 మందికి పైగా ప్రజలు సంతకాలు చేసి పిటిషన్ సమర్పించారని, ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై సమీక్ష జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

### పోరాటం ఆగదు భాజపా స్పష్టం

భూముల రక్షణ కోసం భాజపా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయనున్నట్లు ప్రకటించింది. 'ఈ భూములను వేలం వేయాలని చూస్తే, భాజపా దీన్ని నిలువరించకుండా ఉండదు. ప్రభుత్వానికి మా పోరాట శక్తిని చూపించాల్సిన సమయం ఆసన్నమైంది' అని నేతలు స్పష్టం చేశారు. విద్యార్థులు, పర్యావరణవేత్తలు, రాజకీయ నేతలు భూమిని కాపాడాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

# రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



**బోనకల్, మహా :** మండల పరిధిలో దేవుడమ్మ గుడి ప్రాంగణం, గోవిందాపురం (ఎల్) శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ, పరమేశ్వర, రామపరివారము, లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి, సత్తెమ్మ, మైసమ్మ, గంగమ్మ తల్లి, ధ్వజస్తంభం, నాగేంద్ర స్వామి, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవము. మూడవ రోజు శ్రీ రేణుక ఎల్లమ్మ, ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాలు. -వేద పండితుల ఆధ్వర్యంలో పూజకార్యక్రమాలు.శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో గురువారం రోజు అంగరంగ వైభవంగా ప్రతిష్టాపన మహోాత్సవాలు కొనసాగాయి. ఆలయ నిర్మాణ కమిటీ, ధర్మకర్త డాక్టర్ వెంకటేశ్వర్లు ఇసంపల్లి, డాక్టర్ రోజా రమణి,పర్యవేక్షణలో అత్యంత భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలు ఆహ్లాదకరంగా పండగ వాతావరణంలో జరిగినవి. అన్నదాన కార్యక్రమాన్ని బోనకల్ సబ్ ఇన్స్పెక్టర్ కడగండ్ల మధుబాబు ప్రారంభించారు, కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇసంపల్లి వెంకటేశ్వర్లు, వెంకటరమణ, నిర్మల, గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆ భగవంతుని కృపకు పాత్రులు అయ్యారు, ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, తదితరులు ఉన్నారు.

# మామిడి పంటను రైతులు సాగు చేయాలి



**కామేపల్లి – మహా:** పండ్లలలో లాభదాయక మామిడి పంటను అధికంగా రైతులు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామంలో బానోత్ లక్ష్మణ్ పండిస్తున్న కార్బోరైహిత మామిడి పంటలను పరిశీలించారు. మామిడితోటలో లక్ష్మణ్, రైతులతో కలిసి కలెక్టర్ ముచ్చటించారు. గతంలో ఏ పంటలు సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో పంట వేశారు, అంతర్ పంటల సాగు ఎమైనా ఉందా, మామిడి పంట సంవత్సరానికి ఎంత దిగుబడి వస్తుంది, నీటి వనరులు ఎలా ఉన్నాయి వంటి వివిధ అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మామిడి సాగు విధానం పంట అధిక దిగుబడి కి తీసుకుంటున్న చర్యలు మార్కెటింగ్ విధానాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు .మామిడి సాగుకు రైతులు ఆసక్తి చూపిందుకు చేపట్టాల్సిన చర్యలు వారికి ప్రభుత్వపరంగా అందించాల్సిన తోడ్పాటు వివరాలు అధికారులతో పాటు రైతును అడిగి తెలుసుకున్నారు. కార్బైడ్ రహిత మామిడి పండ్ల విక్రయం ద్వారా అధిక ఆదాయం పొందుతున్న వివరాలతో పాటు కష్ట నష్టాలను రైతు లక్ష్మణ్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మణ్ ని ఆదర్శంగా తీసుకొని నేటి యువ రైతులు లాభదాయక పంటలపై ఆసక్తి చూపాలన్నారు.

# మణుగూరులో భారీ వర్షం



**మణుగూరు, మహా :** వేసవి తాపంతో అల్లాడిపోయిన జనం కొంత ఉపశమనం పొందారు.సింగరేణి ప్రాంతమైన మణుగూరు ఏరియాలో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.కానీ మిర్చి రైతుల మాత్రం గుబులు చెందుతున్నారు.అసలే మార్కెట్ లో మిర్చి ధర లేక పెట్టుబడులు వస్తాయో రావో అనే ఆందోళనలో ఉన్న రైతులు గురువారం కురిసిన అకాల వర్షానికి నానా అవస్థలు పడుతున్నారు.రేపో మాపో అమ్మకానికి సిద్ధంగా కళ్ళాలలో ఆరబోసిన మిర్చి తడిసి ముద్దవ్వడంతో తలలు పట్టుకుంటున్నారు. అంతే కాకుండా కురిసిన భారీ వర్షానికి సింగరేణి ఉపరితల గనులలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది.

# ఆడపిల్ల పుట్టడం ఆ ఇంటికి అదృష్టం



**బోనకల్,మహా:** ఆడపిల్ల పుడితే ఇంటిల్లిపాదీ పండగ చేసుకోవాలని, అదృష్టం ఉన్న వాళ్లకు మాత్రమే ఆడపిల్లలు పుడతారని మండల తాహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ అన్నారు. ఆడపిల్లలు జన్మించిన తల్లిదండ్రులు భారంగా కాకుండా వరంలా భావించాలని,ఆడపిల్ల పుట్టడం అదృష్టమని తెలుపారు,జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 'మా పాప – మా ఇంటి మణిదీపం'కార్యక్రమాన్ని రూపొందించి ప్రారంభించగా అందులో మండల పరిధిలోని మోటమర్రి గ్రామంలో బలవంతపు కావ్య,సురేష్ దంపతులు ఆడపిల్లకు జన్మనివ్వడం బుధవారం మండల వైద్యాధికారి వి స్రవంతి ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఆర్ రమాదేవి,తాహాసిల్దార్ పున్నం చందర్ ఆర్ఐ మైథిలి లా చేతుల మీదగా బలవంత కావ్య సురేష్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి స్వీట్ బాక్స్,పండ్లు,ప్రశంసాపత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు,అనంతరం పాప చదువు,సంరక్షణ గురించి వారికి తెలియజేశారు.

# నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు



**చింతకాని, ఏప్రిల్ 3 (మహా):** చింతకాని మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో రైతులు పండించిన పంట 120 రోజుల్లో చేతికి వస్తుందని చరణ్ సీడ్స్ (సూర్యాపేట ) కంపెనీవారు మోసపూరితమైన మాటలు చెప్పి విత్తనాలను ఇవ్వడం జరిగిందని చిన్నమండవ గ్రామం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ ఉన్న రైతులకు గ్రామానికి చరణ్ సీడ్స్ కంపెనీవారు వచ్చి ఈ విత్తనాలు తీసుకుంటే పంట అధిక దిగుబడి వస్తుందని అన్నారు. వారు మాటలు నమ్మి విత్తనాలు తీసుకుంటే ఇంతవరకు పంట కోత దశకు రాలేదు పొట్టకి రాలేదు నకిలీ విత్తనాలు ఇవ్వడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగింది అని,పంట చేతికి వస్తుందని ఎన్నో అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని కానీ ఇంతవరకు చేతికి రాకపోవడంతో నకిలీ వడ్లు విత్తనాలు అమ్మిన కంపెనీ యజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# పంచాగాన్ని ఆవిష్కరించిన పొంగులేటి



**ఖమ్మం అర్బన్ – మహా:** ఖమ్మం జిల్లా దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర డీ డీ ఎన్ అర్చక సంఘం ముద్రించిన వి శ్వావసు నామ సంవత్సర పంచాగాన్ని రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించినారు. అర్చకులు అందరూ తెలంగాణ రాష్ట్రం శుబిక్షముగా సుసంపన్నమ్ గా ఉండే విధంగా భగవంతుడుని ఆర్చించాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమనికి ఖమ్మం జిల్లా కలక్టర్ ముజుమల్ ఖాన్ రాష్ట్ర గిద్దంగుల సంస్థ చేర్మెన్ రాయల నాగేశ్వరరావు మరియు రాష్ట్ర డీ డీ ఎన్ అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి అన్నావజ్జల ప్రసాద్ శర్మ ఖమ్మం జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు మునగలేటి రమేష్ శర్మ జిల్లా కార్యదర్శి మరిగంటి భార్గవా చార్యులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీధర్ శర్మ ,అమంచి సురేష్ శర్మ, ఉమేష్ బజాపై పాల్గొన్నారు

# లక్ష 20వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు



**ముదిగొండ ఏప్రిల్ 3 మహా :** జిల్లాలో లక్ష ఇరవై వేల మంది రైతులకు రైతు రుణమాఫీ కాలేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ వెల్లడించారు.రైతంగం సమస్యలపై మండలపరిధిలో మేడేపల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసామని చెప్పుకోవడంలో అర్థం లేదన్నారు, రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు.లక్ష,20 వేల మంది రైతుల్లో 80 వేల మంది రైతులు,రెండు లక్షలలోపు బ్యాంకు రుణాలు ఉన్నవారు,ఉన్నారని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శివర్గ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్,జిల్లా కమిటీ సభ్యులు యాద్రపల్లి రవికుమార్,పయ్యావుల పుల్లయ్య,మండల కమిటీ సభ్యులు చెన్ను అంజయ్య,సిఐటియు మండల కన్వీనర్ టిఎస్ కళ్యాణ్,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య,రైతు సంఘం మండల నాయకులు తాటికొండ బాబు తదితరులు పాల్గొన్నారు.


# ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి




**మధిర ఏప్రిల్ 3 మహా:** సిపిఎం పార్టీ మధిర పట్టణ మండల కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మధిర తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి పడకంటి మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకై సిపిఎం పార్టీ పోరాడుతుందని అన్నారు. రైతులు 2 లక్షల రూపాయల రుణమాఫీ కాక పెట్టుబడికి సకాలంలో సహాయం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అప్పుల బాధతో రైతుల ఆత్మహత్యలు ఆగటం లేదని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు పేద మహిళాలుకు 2500 ఇవ్వాలని కూలి భరోసా సంవత్సరానికి 12,000 ఇవ్వాలని. రైతులకు వ్యవసాయ కార్మికులకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అర్హులందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ లో వెంటనే విడుదల చేయాలని వృద్ధులకు ఒంటరి మహిళలకు నాలుగు వేల రూపాయల పెన్షన్లు అమలు చేయాలని వికలాంగులకు 6000 రూపాయల పెన్షన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ కమ్యూనిస్టులు మాత్రమే కూలీలు రైతుల సమస్యల పైన పేద ప్రజల సమస్యల పైన ఉద్యమాలు నిర్వహిస్తారని సమస్యల పరిష్కారం కావాలంటే పోరాటం తప్ప మరొక మార్గం లేదని అన్నారు. పార్టీ మండల పట్టణ కార్యదర్శులు మందా సైదులు దితర సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రైతుబజార్‌లో కూరగాయలు అమ్ముకునేలా చర్యలు

- దళారులకు రైతు బజార్లో అవకాశం ఇవ్వకూడదు
- మొక్కజొన్న పంట కొనుగోలుకు అవసరమైన చర్యలు చేపడతాం
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**ఖమ్మం, ఏప్రిల్ –3, మహా:** రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా రైతు బజార్ లో అమ్ముకునేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.గురువారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ఖమ్మం నగరం 44వ డివిజన్ శ్రీరామ్ నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు 58.50 లక్షలతో షెడ్లు, ప్లాట్ ఫాంలను నిర్మించి రైతు బజార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులు సొంతంగా నేరుగా అమ్ముకునేందుకు సౌకర్యంగా ఉండాలని గతంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ లో నేడు ఫ్లాట్ ఫాం, షెడ్లు నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. పేద రైతుల కోసం కలెక్టర్ మంచి హృదయంతో ఈ పనులు పూర్తి చేశారని తెలిపారు. మార్కెట్ లో పంట పండించే రైతులకు మాత్రమే స్థానం ఇవ్వాలని, దళారులకు ఎట్టి పరిస్థితిలో అవకాశం ఇవ్వకూడదని, ఖమ్మం చుట్టుపక్కల ఉన్న రైతులు నేరుగా వచ్చి అమ్ముకోవాలని, అప్పుడు రైతులకు ఒక రూపాయి మిగలడంతో పాటు స్థానిక ప్రజలకు తాజా కూరగాయలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను త్వరలోనే ప్రారంభించేలా మార్కెటింగ్ శాఖ సంచాలకులకు ఆదేశాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రైతుకు వచ్చే లాభాలు పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా రైతు బజార్ ప్రారంభించామని అన్నారు. రైతులు ఏ పంటలు పండించాలి, ఎలా పండించాలి అనే అంశాలపై దృష్టి సారించి లాభసాటి సాగు గురించి జిల్లాలో మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని కలెక్టర్ తెలిపారు. మధ్యవర్తులను నివారిస్తూ రైతులకు అధిక లాభం లభించేలా రైతు బజార్ లను ఏర్పాటు చేశామని, 35 లక్షలతో గాంధీ చౌక్ వద్ద మరో మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, మరో నెల రోజులలో ఆ మార్కెట్ సిద్ధం చేస్తామని అన్నారు. ఈ రైతు బజార్ వద్ద రైతులు నుంచి నేరుగా వినియోగదారులు కూరగాయలను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు



**ఖమ్మం, ఏప్రిల్ –03, మహా:** నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించారు. మద్దులపల్లిలో మద్దులపల్లి నుండి తల్లంపాడు – తెల్దారుపల్లి జెడ్పీ రోడ్డు వరకు సి.ఆర్.ఆర్. నిధులు ఒక కోటి 80 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, వరంగల్ క్రాస్ రోడ్డులో తరుణి హాట్ నందు 2 కోట్లతో ఏర్పాటు చేయనున్న 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రం పనులకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సరఫరా అన్ని రంగాలకు అందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలలో సబ్ స్టేషన్ లను అభివృద్ధి చేస్తుందని, ఇందులో భాగంగా ఖమ్మం రూరల్ ప్రాంతంలో పవర్ ఇబ్బందులు తొలగించేందుకు సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టామని అన్నారు. పేదల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం నిబద్దతతో పని చేస్తుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేక పోయినా ఎక్కడా వెనకడుగు వేయకుండా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని అన్నారు. గడిచిన 15 నెలలో అన్ని శాఖలలో ప్రక్షాళన చేసి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అందిస్తున్నామని అన్నారు. చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను వర్షాకాలంలోగా పూర్తి చేయాలని అన్నారు.

# రేషన్ షాపులను సందర్శించిన బిజెపి నాయకులు

**మధిర ఏప్రిల్ 3 మహా:** పట్టణంలోని ఉన్నటువంటి రేషన్ షాపులను భారతీయ జనతాపార్టీ నాయకులు సందర్శించటం జరిగినది.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ఈరోజు పేదలకు అందిస్తున్న సన్నబియ్యం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గరీబ్ కళ్యాణ్ అన్న యోజనలో భాగంగా పేదలకు అందించాలని ఆకలితో ఎవరు కూడా ఉండకూడదు అని సంకల్పించి ఈ యొక్క పథకాన్ని అమలు చేయడం జరిగినది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి కేజీకి కూడా సుమారుగా నలభై రూపాయలు కేటాయించడం జరుగుతుంది అన్నారు. ఈ విదంగా చూస్తే ఒక కుటుంబంలో సుమారుగా 18కేజిలు సన్నబియ్యం ఇస్తే వాటిలో 15 కేజిలు కేంద్రప్రభుత్వం భరిస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం 3కేజిలు మాత్రమే భరిస్తున్నది అన్నారు తెలంగాణ వ్యాప్తంగా పేదలకు ప్రతి కుటుంబానికి అందిస్తున్న సందర్భంగా ఈ యొక్క పథకాన్ని ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణ రావు, జిల్లా మన్కి బాద్ కన్వీనర్ మార్సకట్ల స్వర్ణకార్, పట్టణ ప్రధానకార్యదర్శులు పగడాల నాగేంద్రబాబు, బియ్యవరపు రామకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు మాదిరాజ్ సాయిరామ్, మాదవసాయి, గౌసిద్దీన్, దార్ల ప్రభుదాస్ ఖాజామియా అదేవిదంగా రేషన్ షాప్ డీలర్లు రావి కోటేశ్వరరావు, రవికుమార్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

